క్లుప్తంగా

ఎంపీడీఓగా నగేష్‌కుమారి

పొదలకూరు : ఎంపీడీఓగా టి.నగేష్‌కుమారి బుధవారం పొదలకూరులో బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎన్నికల ముందు ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసి ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి పొదలకూరు ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈమె స్థానంలో ఎన్నికలకు ముందు చిత్తూరు జిల్లా నుంచి మహ్మద్‌రఫీ ఎంపీడీఓగా బదిలీపై వచ్చి బాధ్యతలు నిర్వహించారు. ఆయన చిత్తూరు జిల్లాలోని వి.కోటకు తిరిగి ఎంపీడీఓగా వెళ్లారు.

మనుబోలు ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు

మనుబోలు : మనుబోలు ఎంపీడీఓగా గండవరపు వెంకటేశ్వర్లు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఎన్నికలకు ముందు కలిగిరి మండలంలో పనిచేస్తూ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా తవనంపల్లికి బదిలీపై వెళ్లారు. తిరిగి మనుబోలు ఎంపీడీఓగా నియమితులయ్యారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జడ్జి చైతన్య

కోవూరు : విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోవూరు లీగల్ సెల్ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి పి.చైతన్య అన్నారు. కోవూరు మండలం గంగవరం వద్ద ఉన్న గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆమె పాల్గొని, మాట్లాడారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు, మద్యం వంటి వాటి జోలికి వెళ్లొద్దని తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ కె.సందీప్‌కుమార్ మాట్లాడుతూ మత్తుకు బానిసైతే విచక్షణ కోల్పోతామని, వాటికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ ప్రసాద్ రెడ్డి, లీగల్ సెల్ సభ్యుడు రాంబాబు పాల్గొన్నారు.

మనుబోలులో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సోమిరెడ్డి

మనుబోలు : మనుబోలు మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మనుబోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను ఆయన బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ వేణుగోపాల్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ప్రజాసేవే లక్ష్యం

• ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



విద్యాకిట్‌ను అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కోవూరు : రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తానని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని లేగుంటపాడులో పలు అభివృద్ధి పనులను ఆయన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం లేగుంటపాడు గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి, సీసీరోడ్డు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సర్పంచ్ జెట్టి రాజగోపాలరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. లేగుంటపాడు గ్రామం నుంచి హైవేకు రోడ్డు వేస్తామన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని వెల్లడించారు. అనంతరం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు విద్యా కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అమరావతి, ఎంపీపీ పార్వతి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు మోదీ చిత్రపటాలు



పొదలకూరు : మండల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలకు భారత ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలను మండల బీజేపీ నాయకులు బుధవారం అందజేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్, సీహెచ్‌సీ తదితర కార్యాలయానికి నాయకులు వెళ్లి ప్రధాని చిత్రపటాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు అయోధ్యరామయ్య, సీనియర్ నాయకుడు సీహెచ్ చినసుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షుడు రాచపూటి ధనుంజయరావు, ఓబీసీ అధ్యక్షుడు ఓబులేసు, యువమోర్చా నాయకుడు ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతుల ఆశలు.. అడియాశలు

- కండలేరు ఆయకట్టు రైతులకు నిరాశే
- సోమశిలకు తగ్గిన ఇన్‌ఫ్లో
- ఖరీఫ్ పంటలకు నీటి విడుదల కష్టమే
- లిఫ్ట్ పద్ధతిలో కాలువకు నీటిని విడుదల చేయాలి



కండలేరు జలాశయం

పొదలకూరు : శ్రీశైలం ప్రాజెక్టు క్రస్ట్‌గేట్లను మూసివేసిన నేపథ్యంలో సోమశిల జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గుముఖం పడుతోంది. జిల్లా వరప్రదాయినిగా ఉన్న సోమశిలకు రబీసీజన్ కంటే ముందే వరదనీరు వచ్చి ప్రాజెక్టులో నీటి మట్టం పెరుగుతుందని, తద్వారా మెట్టప్రాంతానికి కండలేరు జలాశయానికి నీరు విడుదల చేస్తారని రైతులు ఆశించారు. అయితే శ్రీశైలం నుంచి సోమశిలకు ఆశించిన స్థాయిలో నీరు వచ్చి చేరలేదు. శ్రీశైలం పైతట్టు ప్రాంతాల నుంచి వరద ఉధృతి తగ్గడంతో జలాశయం అధికారులు గేట్లను మూసివేశారు. ఫలితంగా సోమశిలకు 14 వేల క్యూసెక్కుల పైబడి ఉన్న వరద ప్రవాహం 10 వేల క్యూసెక్కులకు తగ్గింది. ఈ ఉధృతి మరింతగా తగ్గే అవకాశం కూడా ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సోమశిలలో 20 టీఎంసీల నీటి నిల్వ ఉండగా గడిచిన 14 రోజుల్లో సోమశిలకు పైతట్టు నుంచి 10 టీఎంసీలు వరదనీరు వచ్చి చేరింది. ఇది శుభపరిణామం.. అయినప్పటికీ మరింతగా వరద నీరు వచ్చి చేరుతుందని రైతులు భావించారు. అయితే శ్రీశైలం పైతట్టు నుంచి వరద రోజురోజుకు తగ్గిపోవడం వల్ల అవుట్‌ఫ్లోను తగ్గించి వేశారు. దీంతో సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 5 నుంచి 10 టీఎంసీల వరదనీరు వచ్చి చేరుతుందని భావించిన రైతులకు నిరాశే మిగిలింది. ఖరీఫ్ పంటలను సాగు చేస్తున్న మెట్టరైతుల ఆశలు ఆవిరి అయినట్లుగా చెబుతున్నారు. ప్రధానంగా సర్వేపల్లి నియోజకవర్గంలోని పొదలకూరు, మనుబోలు మండలాల్లో కండలేరు నీటిని ఆధారం చేసుకుని ఖరీఫ్ పంటల సాగవుతున్నాయి. పొదలకూరు, మనుబోలు మండలాల్లోని కొన్ని గ్రామాలకు కండలేరు ఏటికాలువ ప్రాజెక్టు లో-లెవల్ స్లూయిజ్ ద్వారా నిరంతరాయంగా స్వల్పంగానైనా సాగు నీటిని విడుదల చేస్తుంటారు. రాపూరు మండలం సంక్రాంతిపల్లి పికప్ ఆనకట్ట నుంచి పిన్నేరు వాగు ద్వారా మనుబోలు మండలంలోని మరికొన్ని గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుంది. అయితే కండలేరు జలాశయంలో డెడ్‌స్టోరేజీ కంటే తక్కువగా.. అంటే 3 టీఎంసీల నీటినిల్వ మాత్రమే ఉంది. ఫలితంగా కాలువలు, సహజసిద్ధంగా ఉన్న ఏర్లకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండదు.

20 టీఎంసీలు దాటితేనే నీటి విడుదల

సోమశిల నుంచి కండలేరుకు ఫ్లడ్‌ఫ్లో కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలంటే సోమశిలలో 20 టీఎంసీలు పైబడి నీటి నిల్వ ఉండాలి. పైతట్టు నుంచి సోమశిలకు ఇన్‌ఫ్లో ఉన్న కారణంగా 20 టీఎంసీలు పైబడే అవకాశం ఉన్నందున కండలేరు నీటిని విడుదల చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. అయితే చెన్నై నగర తాగునీటి అవసరాల కోసం కండలేరుకు సోమశిల నుంచి 5 టీఎంసీలు మాత్రమే నీటిని విడుదల చేసేందుకు అధికారులు సిద్ధపడుతున్నారు. ఈ ఐదు టీఎంసీల్లోనే చెన్నై మెగాసిటీ తాగునీటి అవసరాలు తీర్చి కండలేరు కింద ఉన్న సాగునీటి కాలువకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. డెడ్‌స్టోరేజీలో ఉన్న కండలేరు నుంచి ఖరీఫ్ పంటల రక్షణకు సాగునీటిని ఏమేరకు విడుదల చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారనుంది. కండలేరు ఎడమగట్టు కాలువకు గ్రావిటీ ద్వారా నీటిని విడుదల చేయాలంటే జలాశయంలో 34 టీఎంసీల నీటినిల్వ ఉండాలి. లేదంటే లో-లెవల్ స్లూయిజ్ ద్వారా లిఫ్ట్ ఇరిగేషన్ సిస్టమ్ నుంచి ఎడమ కాలువకు నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. ఈ పద్ధతిలో కాలువకు సాగునీటిని విడుదల చేయాలంటే వ్యయ ప్రయాశలతో పాటు లిఫ్ట్‌ఇరిగేషన్‌కు వాడకానికి పాత విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది.

పంద్రాగస్టుకు కళావందనం



మనుబోలు : లవంగంపై జాతీయ జెండా

మనుబోలు : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు ఆలూరు రాము బుధవారం లవంగంపై అతి చిన్నదైన జాతీయ జెండాను తయారు చేసి అందరినీ అబ్బురపరిచాడు. రాము ప్రతిభను పలువురు కొనియాడుతున్నారు.



ముత్తుకూరు : సూదిపై మువ్వన్నెల పతాకం

గుండు సూదిపై..

ముత్తుకూరు : మండలంలోని నారికేళపల్లి పంచాయతీ, సుబ్బారెడ్డిపాళెం యూపీస్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం గుండు సూదిపై మువ్వన్నెల పతాకాన్ని బుధవారం రూపొందించారు. అట్ట ముక్క, వాటర్ కలర్స్‌తో సూక్ష్మచిత్రాన్ని ఆవిష్కరించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం నేడు

పొదలకూరు : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని అమ్మవారిపాళెం జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు గురువారం బహుమతుల ప్రదానం ఉంటుందని ఏపీఆర్డీ ఆర్గనైజేషన్ స్టేట్ అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ టి.వెంకటేశ్వర్లు బుధవారం తెలిపారు. ఇటీవల విద్యార్థులకు క్రీడాపోటీలను నిర్వహించినట్లు తెలియజేశారు. విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు విద్యార్థులకు సామాజిక అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తామన్నారు.

రీ-సర్వే డీటీకి డిప్యుటేషన్

పొదలకూరు : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో రీ-సర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్‌ఎస్ సాయిగణేష్ డిప్యుటేషన్‌పై జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. ఈయన పొదలకూరులో డిప్యూటీ తహసీల్దార్‌గా, రీ-సర్వే డీటీగా సేవలు అందించారు.

గడ్డివామి దగ్ధం

• రూ.70 వేల నష్టం



మనుబోలు : మనుబోలు కోదండరామపురానికి చెందిన కందల శ్రీనివాసులుకు చెందిన గడ్డివామి బుధవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. పశువుల మేత కోసం శ్రీనివాసులు ఇంటి సమీపంలో గడ్డివామి వేసుకుని ఉండగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను అదుపు చేసినప్పటికీ చాలా వరకు కాలిపోయింది. ఎవరో సిగరెట్ తాగి పడేసి ఉంటారని భావిస్తున్నారు. దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

నేడు పొదలకూరుకు కాకాణి రాక

పొదలకూరు : మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి విచ్చేస్తారని ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం అవుతారని పేర్కొన్నారు. అనంతరం మీడియా సమావేశం నిర్వహిస్తారని చెప్పారు.

పుట్టిన వెంటనే జనన ధ్రువీకరణ పొందాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రత్యూష

ముత్తుకూరు : తల్లులు బిడ్డలకు జన్మనిచ్చిన వెంటనే జనన ధ్రువీకరణ పత్రం పొందాలని ఎంపీడీఓ ప్రత్యూష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. బిడ్డకు పేరు పెట్టిన తర్వాత ఆధార్ కార్డు పొందాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఈ అంశంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ సురేష్‌బాబు మాట్లాడుతూ, గతంలో 14 సచివాలయాలకు భవనాలు మంజూరైతే ఏడు మాత్రమే నిర్మాణమయ్యాయని తెలిపారు. రెండు భవనాలు వివిధ దశల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఆర్బీకే భవనాలు 15 మంజూరైతే రెండు మాత్రమే పూర్తయ్యాయని అన్నారు. ఆరు భవనాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సబ్సిడీపై 15 కిలోల నవధాన్యాల కిట్లు పంపిణీ చేపట్టనున్నట్లు మండల ఏఓ జ్యోత్స్నరాణి అన్నారు. ఎంపీపీ గండవరం సుగుణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అయితే, ఈ సమావేశం మొక్కుబడిగా జరిగింది.

సమస్యలను పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న రఘురామయ్య

విడవలూరు : పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తామని డిప్యూటీ డీఈఓ రఘురామయ్య అన్నారు. మండలంలోని వావిళ్ల జెడ్పీ పాఠశాలలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ వెంకటేశ్వర్లతో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం తప్పకుండా చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం చెంచురమయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటును పూర్తి చేయండి

కొడవలూరు : ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని డిప్యూటీ డీఈఓ పి.రఘురామయ్య సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయాన్ని బుధవారం ఆయన సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సర్దుబాటు విషయాన్ని ఎంఈఓ ఎస్.అంకయ్యను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరగా సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేసి ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. సీఆర్పీలు ఎం.దయాకర్, జె.పెంచలరావు, విజయమ్మ, మస్తాన్ ఉన్నారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో ఇంటికే వైద్యం

• వైద్యాధికారి బాలచంద్రబాబు



తలమంచిలో వైద్య సేవలందించిన బృందం

కొడవలూరు: 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే ఉచిత వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయని కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.బాలచంద్రబాబు అన్నారు. మండలంలోని తలమంచిలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేసి పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఇవ్వడంతో పాటు గర్భిణుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలో అనూహ్య స్పందన లభిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎస్ వి.రామ్మోహన్, హెచ్‌ఏ సుధాకర్, ఏఎన్‌ఎం అనిత, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'హర్ ఘర్ తిరంగా'



వెంకటాచలం : వీఎస్‌యూలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు



తోటపల్లిగూడూరు : చెన్నపల్లిపాళెంలో విద్యార్థుల ర్యాలీ

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ)లో హర్ ఘర్ తిరంగా ర్యాలీని బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులకు ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు జాతీయ జెండాలను అందజేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ప్రతి ఒక్కరూ ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ సీహెచ్.విజయ, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ఉదయ్‌శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

• తోటపల్లిగూడూరు : మండలంలోని చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో పాఠశాలలోని 500 మంది విద్యార్థులతో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని చేపట్టారు. మహాలక్ష్మీపురం సెంటర్‌లో విద్యార్థులు కోలాట ప్రదర్శన చేశారు. జై ఇండియా, లవ్ ఇండియా నినాదాలతో మారుమోగించారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. హెచ్‌ఎం సాయిప్రసాద్, ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఫణికుమార్, ఉపాధ్యాయులు మోహన్, ప్రసాద్, చంద్రమౌళి, విద్యాధరి, జయభారతి, సులోచన, విజయలక్ష్మి పాల్గొన్నారు.

– బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని ఏడోవార్డు ఖాజానగర్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో హర్ ఘర్ తిరంగ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాను చేతపట్టి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మస్తానయ్య మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆదర్శవంతమైన ప్రవర్తన కలిగి, దేశ అభ్యున్నతికి తోడ్పడాలని కోరారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఖాజానగర్‌లో..

స్కాలర్‌షిప్‌ల పంపిణీ



ముత్తుకూరు : మండలంలోని బ్రహ్మదేవి కెనరాబ్యాంకు సహకారంతో స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులకు కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లను బుధవారం పంపిణీ చేశారు. విద్యాజ్యోతి పథకం కింద ఆరో తరగతి విద్యార్థిని మీనాక్షి, ఎనిమిదో తరగతి విద్యార్థిని శ్రీవిద్యకు నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో స్కాలర్‌షిప్ మొత్తాన్ని అందచేశారు. హెచ్‌ఎం తాన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించండి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని వారు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల టీడీపీ ప్రభుత్వం నూతన ఇసుక విధానం పేరుతో మినగల్లు ఇసుక రీచ్‌ను నిలిపి వేశారన్నారు. దీంతో ఇసుక తోలకాలు లేక ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇసుక పాలసీ జాప్యంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. వెంటనే ఇసుక రీచ్‌ను ప్రారంభించి తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.